# ప్రవాసంలో బీజేపీ రాజకీయ చిచ్చు



సంజయ్ బారు

ఇటీవల కొన్ని పశ్చిమ దేశాల్లో తలెత్తుతున్న ఖలిస్థానీ కార్యకలాపాలు భారత వ్యతిరేక శక్తులతో చేతులు కలిపిన కొన్ని ప్రవాస భారత బృందాల దుష్టపన్నాగాలను మరోసారి మన ముందుకు తెచ్చాయి. ఒకింత తొట్రుపాటుపడినా ఇది భారత దేశం ఎదుర్కోగలిగే సవాలు మాత్రమేనని గుర్తుంచుకోవాలి. అయితే భారత వ్యతిరేక శక్తుల నుంచి ఎదురయ్యే ముప్పు, ప్రవాస భారతీయులు ఇంటాబయటా విసిరే సవాళ్ల మధ్య తేడాను మనం గమనించాలి. రెండోది భారతదేశానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులకు మధ్యన గల సంక్లిష్ట రాజకీయ సంబంధాలను ఇది గుర్తు చేస్తుంది.



ప్రవాస భారతీయులు సొంత గడ్డపై, విదేశాల్లో చేపడుతున్న రాజకీయ కార్యకలాపాలు భారత దౌత్య వ్యవస్థకు పరీక్షగా మారుతున్నాయి. విదేశాల్లో స్థిరపడిన మోదీ అనుకూల భారతీయుల నుంచి లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. ప్రస్తుత దౌత్యసమస్య అనే నాణేనికి మరోవైపున మోదీ వ్యతిరేక ఎన్నారైలు ఉన్నారు. దౌత్య వ్యవహారాల్లోకి, స్వదేశీ రాజకీయాల్లోకి ప్రవాసులను లాగడం వల్ల లాభమూ ఉంటుంది, నష్టమూ ఉంటుంది.

ప్రధాని విదేశాలకు వెళ్లినప్పుడల్లా బీజేపీ ప్రవాస భారతీయులను సమీకరించి మోదీ మోదీ మోదీ అని నినాదాల మోత మోగిస్తుండటం వల్ల, స్వదేశీ రాజకీయాల్లోకి వారిని లాగడం వల్ల ప్రవాసుల్లో రాజకీయాలు బలపడుతూ వచ్చాయి. లండన్, న్యూయార్క్, హ్యూస్టన్ తదితర విశ్వ నగరాల్లో మోదీ అనుకూల బృందాల కార్యకలాపాలను టీవీల్లో చూపితే ఆయనను రాజకీయంగా వ్యతిరేకించే వారు ఊరుకుంటారా? తమ వాణిని కూడా వినిపించాలని పట్టు పడతారు. పూర్తిగా వ్యక్తిగత శైలిలో ప్రధాని నెరపే దౌత్యం ప్రవాసులకు మాతృదేశం పట్ల ఉండే ప్రేమకు, ఒక రాజకీయ నాయకునిపై ఉండే అభిమానానికి మధ్య హద్దులు చెరిపేస్తున్నది.

ఢిల్లీ పాలకవర్గానికి ఆ సంగతి తెలుసు. పైగా ప్రవాస భారతీయుల రాజకీయ సమీకరణకు ముందుగా అడుగులు వేసింది వారే. విదేశాల్లోని మోదీ అనుకూల బృందాలకు స్వదేశంలో ప్రచారం దక్కేలా బీజేపీ చర్యలు చేపట్టింది. అదే సమయంలో ఇతరులు మోదీ వ్యతిరేకులకే కాదు, భారత వ్యతిరేకులకూ ప్రచారం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. భారత మీడియాలోని వర్గాలు బీజేపీకి వంతపాడుతూ ప్రధానిని విమర్శించడం దేశాన్ని విమర్శించడంగా భాష్యం చెప్తున్నాయి. ఈ ధోరణి ప్రవాస భారతీయులు స్థిరపడ్డ దేశాల్లో ఆందోళనకు దారితీసింది. అనేక దేశాలు భారతదేశంలోని రాజకీయ విభేదాలు తమతమ స్థానిక రాజకీయాల్లోకి ఎక్కడ చొచ్చుకు వస్తాయోనని, దౌత్య సంబంధాలను ఎక్కడ దెబ్బ తీస్తాయోననే అనుమానంతో ప్రవాస భారతీయ రాజకీయులపై ఓ కన్నేసి ఉంచుతున్నాయి.

ఆసక్తి కలిగించే అంశమేమంటే ప్రవాస భారతీయుల రాజకీయ కార్యకలాపాల వల్ల స్వతంత్ర భారతం ఎదుర్కోబోయే సవాళ్లను జాతీయోద్యమ నాయకత్వం ఆ రోజుల్లోనే గుర్తించింది. 1947 నాటికే భారత దేశ ఉదాహరణను, విజయాలను అనుసరించి బ్రిటిష్ సామ్రాజ్యంతోపాటు ఇతర యూరోపియన్ సామ్రాజ్యాలన్నింటిలో వలసవాద వ్యతిరేక ఉద్యమాలు ఊపందుకుంటున్నాయి.

అనేక బ్రిటిష్ వలసదేశాల్లో ప్రవాస భారతీయులు ఆ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఆ పరిస్థితుల్లో మాతృదేశమైన భారత్ ప్రవాస భారతీయులతో ఏ తరహా సంబంధాలు కలిగి ఉండాలన్న ప్రశ్న అప్పటి జాతీయ నాయకత్వాన్ని వేధించింది. ప్రవాస భారతీయులతో భారత్ సంబంధాల్లో మూడు రకాల ఆలోచనలు నాటి జాతీయ నాయకత్వంలో ఉండేవని దౌత్యవేత్త నిరంజన్ దేశాయ్ 'ఇండియా అండ్ ఇట్స్ డయాస్పోరా' (ఇండియన్ ఫారిన్ అఫేర్స్ జర్నల్, అక్టోబర్-డిసెంబర్- 2006) అనే వ్యాసంలో రాశారు. ఆగాఖాన్, సర్ ఫిరోజ్‌షా మెహతా వంటివారు బ్రిటిష్ వలస దేశాల్లోని ప్రవాస భారతీయులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండాలని, భారతీయులు అధిక సంఖ్యలో ఆయా దేశాలకు వలస వెళ్లేందుకు మార్గం సుగమం చేయాలని వాదించారు. అధిక జనాభా కలిగిన భారత్ నుంచి ఎంత ఎక్కువ మంది వలస పోతే భారం అంత తగ్గుతుందని వారు ఆశించారు.

తేజ్ బహదూర్ సప్రూ, జీఏ నటేశన్, వీఎస్ శ్రీనివాసశాస్త్రి, పురుషోత్తం దాస్ ఠాకూర్ దాస్‌తో కూడిన రెండోవర్గం మరి కొంచెం ముందుకు వెళ్లింది. వలసవెళ్లిన భారతీయుల హక్కుల గురించి నొక్కిచెప్పారు. బ్రిటిష్ సామ్రాజ్యంలోని వలస దేశాలన్నిటిలోని ప్రవాస భారతీయులకు స్థానిక ప్రజలతో సమానంగా హక్కులు కల్పించాలని వారు వాదించారు. సామ్రాజ్యంలోని పాలితులుగా వలస వచ్చినవారు, స్థానికులు దేశం, జాతి అనేవాటితో నిమిత్తం లేకుండా సమాన హోదా పొందాలని వారు విశ్వసించారు. అందువల్ల ఆయా విదేశాల్లోని ప్రవాస భారతీయుల హక్కులకోసం స్వతంత్ర భారతం క్రియాశీలకంగా కృషి చేయాలని తెలిపారు.

మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ ఆ రెండు వర్గాలతో విభేదించారు. వారిది మానవీయమైన వైఖరిగా వ్యాసకర్త నిరంజన్ దేశాయ్ అభివర్ణిస్తారు. బ్రిటిష్ వలస దేశాల్లోని భారత సంతతి ప్రజలు స్థానికులతో కలిసిపోయి ఆతిథ్యదేశంతో మమేకం కావాలని గాంధీ, నెహ్రూలిద్దరూ భావించారని వివరించారు. సొంత దేశానికి, ప్రవాస దేశానికి మధ్య ఎలాంటి ద్వంద్వ విధేయత రావద్దని హెచ్చరించారు. ప్రవాస భారతీయులు తమతమ ఆతిథ్య దేశాల పౌరసత్వ హక్కులను సాధించుకుని ఆయా దేశాలలో భాగమైపోవాలని నెహ్రూ తరచుగా చెప్పేవారు.

ఆ రోజుల్లో దేశాదేశాల్లో భారతదేశ వలస విముక్తి కోసం ప్రచారోద్యమ బాధ్యతలు నిర్వహించిన కాంగ్రెస్ శాఖలుండేవి. కార్యకర్తలూ ఉండేవారు. వీకే కృష్ణమీనన్ మొదలుకుని నేతాజీ సుభాష్ చంద్రబోస్ దాకా విదేశీ గడ్డ మీద నుంచి భారత స్వాతంత్ర్యం కోసం కృషి చేసిన ప్రముఖులెందరో ఉన్నారు. స్వతంత్ర భారతదేశ స్థానిక రాజకీయాలకు, విదేశాల్లోని ప్రవాస భారతీయుల రాజకీయాలకు మధ్య స్పష్టమైన విభజన రేఖ ఉండాలని నెహ్రూ నొక్కిచెప్పేవారు. వారి (ప్రవాస భారతీయుల) పట్ల మన ఆసక్తి సాంస్కృతిక, మానవీయ అంశాలకే పరిమితం అవుతుంది, రాజకీయాలకు ఇక్కడ తావులేదు అని 1947లో లోక్‌సభలో ఆయన చెప్పారు. అప్పట్లో బ్రిటిష్ భూభాగాల విషయమై చెప్పిన ఈ మాటలు నేడు యావత్తు ప్రపంచంలోని ప్రవాస భారతీయులకు వర్తిస్తాయి. విదేశాల్లోని భారతీయులు ఆయాదేశాల పౌరులైపోయిన తర్వాత మాతృదేశ రాజకీయాల్లో తలదూర్చడం వారు మానుకోవాలి.

కాగా గతకొద్ది సంవత్సరాలుగా బీజేపీ ఇందుకు భిన్నమైన మార్గంలో పోతున్నది. స్వదేశీ గడ్డపై రాజకీయ లబ్ధి కోసం ప్రవాస భారతీయులను అంతకంతకూ అధికంగా సమీకరించే పనిలో పడింది. తద్వారా ప్రవాసుల్లో రాజకీయాలు పొడసూపడానికి, వారు ఇతోధికంగా భారత రాజకీయాల్లో తలదూర్చడానికి కారణమైంది. మతానికి, రాజకీయాలకు మధ్య విభజన రేఖను మసకబార్చడం ద్వారా కేవలం సామాజిక, సాంస్కృతిక శాఖలకే పరిమితమైన ప్రవాసుల కార్యకలాపాలకు రాజకీయం పులిమేసింది. ప్రవాస భారతీయులకు ఆశ్రయమిచ్చిన దేశాలతో భారత్ దౌత్య సంబంధాలపై దీని ప్రభావం పడుతుందని ముందుగానే ఊహించినవారికి తాజా పరిణామాలు ఆశ్చర్యం కలిగించవు.

కొందరు ప్రవాస రాజకీయ జీవులు ఈ తరహా ఎత్తుగడలకు సై అంటున్నారు. బ్రిటిష్ ప్రధాని రిషీ సునక్ ఇంగ్లండ్‌లో గోపూజలు చేస్తున్నారు. ఢిల్లీలో ఆలయ సందర్శనను పెద్దఎత్తున ప్రచారం కోసం వాడుకున్నారు. ఇంగ్లండ్‌లోని హిందూ ఓట్లు రాబట్టేందుకు, ఢిల్లీలోని పాలకులను ప్రసన్నం చేసుకునేందుకు ఆయన ఈ తరహా పనులు చేస్తున్నారని తెలుస్తూనే ఉన్నది. ఈ తరహాలో మతాన్ని రాజకీయాలతో, రాజకీయాలను దౌత్యసంబంధాలతో, జాతి అస్తిత్వాన్ని వ్యక్తి గుర్తింపుతో కలగాపులగం చేయడం వల్ల తయారయ్యే ప్రమాదకర రసాయనం ప్రపంచంతో భారత్ సంబంధాలకు చేటు తెస్తుంది.

(ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో)

అనువాదం: తుమ్మలపల్లి రఘురాములు



## మెట్ట ప్రాంత వరప్రదాయని 'మల్కపేట'



పాకాల శంకర్ గౌడ్
98483 77734

ప్రస్తుత రాజన్న సిరిసిల్ల జిల్లా ఒకప్పుడు కరువు ప్రాంతం. నేడు ఎటు చూసినా ఆకుపచ్చని చెట్లు, పచ్చని పంటలు, నిండిన చెరువులు, కుంటలు పెరిగిన భూగర్భ జలాలు. కండ్ల ముందు కనబడుతున్న ప్రకృతి రమణీయ దృశ్యం. సంకల్ప సిద్ధి ఉన్న పాలకులు ఉంటే అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చని రుజువు చేసిన అపర భగీరథ ప్రయత్నం.

రాష్ట్రంలో కరువును తరిమికొట్టి సస్యశ్యామలం చేసే దిశగా అపర భగీరథుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు చేసిన ప్రయత్నమే కాళేశ్వరం ప్రాజెక్ట్. దీని ద్వారా 16.40 లక్షల ఎకరాల భూమికి సాగునీరు అందించే బృహత్తర ప్రణాళిక అమల్లోకి వచ్చింది. నాటి ఆంధ్ర పాలకుల నిర్లక్ష్యానికి తెలంగాణలోని అనేక ప్రాజెక్టులు నిరాదరణకు గురయ్యాయి. ఉద్యమకారులే పాలకులైతే, వారికి చిత్తశుద్ధి ఉంటే ఏ విధంగా లక్ష్యసాధన చేయవచ్చో నిరూపించారు మన ముఖ్యమంత్రి కేసీఆర్.

నాడు మధ్య మానేరు నుంచి 6 టీఎంసీల నీటిని ఎత్తిపోయడానికి ప్రభుత్వం ప్రత్యేక జీవో ద్వారా పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. దీని ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో కేవలం 0.35 టీఎంసీల నీటి సామర్థ్యంతో నూతన జలాశయ నిర్మాణానికి (ప్యాకేజీ 9లో భాగంగా) ప్రతిపాదన జరిగింది.

రాజన్న సిరిసిల్ల జిల్లా మెట్ట ప్రాంతం. ఇక్కడ నీటి సౌకర్యం కరువై రైతన్నలు సాగు, తాగునీటి కోసం వారి భూముల్లో ఎన్నో బోర్లు వేసిన సందర్భాలు ప్రత్యక్షంగా చూశాం. బోర్లు ఫెయిలై అప్పుల బాధలు భరించలేక అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. నాడు 800 ఫీట్ల మేర బోరు వేసినా చుక్కనీరు రాని దుస్థితి. ఇక్కడ పంటలు ప్రధానంగా వర్షాలు, బావుల మీద మాత్రమే ఆధారపడి సాగయ్యేవి. యువత ఉపాధి కరువై బొంబాయికి, గల్ఫ్ దేశాలకు వలస వెళ్ళేవారు. కల్లోలిత ప్రాంతం కావడం వల్ల గతంలో ఆంధ్ర పాలకులు ఈ ప్రాంత అభివృద్ధికి చొరవ చూపలేదు. ఆనాడు ఈ పరిస్థితులన్నింటినీ ప్రత్యక్షంగా చూసి చలించి పోయిన సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ చెన్నమనేని రాజేశ్వరరావు ఈ మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి, రైతాంగ ఉపాధి కోసం ఎత్తిపోతల పథకం ఒక్కటే శరణ్యమని ప్రతిపాదించారు.

మల్కపేట వాస్తవ్యులు, ఉమ్మడి సిరిసిల్ల ఎమ్మెల్యే కీర్తిశేషులు కర్రోళ్ల నర్సయ్య స్థానిక యువకులతో చాలా సందర్భాల్లో మాట్లాడుతూ పాలకులు మారినా ఈ ప్రాంత బతుకులు మారవని, ఎత్తిపోతలు ఎప్పుడూ ఎన్నికల హామీగానే మిగిలిపోతుందని దిగులు చెందేవారు. ఈ మెట్ట ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సాగునీరు ఉండాలని, దానికి ఎత్తిపోతల ఒక్కటే మార్గమని బలంగా కాంక్షించేవారు.

ఉద్యమ కాలంలో ప్రజల కష్టాలు, ముఖ్యంగా రైతుల కష్టాలు ప్రత్యక్షంగా చూసి చలించి పోయిన ఆనాటి ఉద్యమ నాయకులు, నేటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు రైతులు స్వరాష్ట్రంలో సంక్షోభంలో కాకుండా సంక్షేమంలో చల్లగా బతుకాలని కోరుకున్నారు. తద్వారా వారు ఆర్థికవృద్ధికి నోచుకోవాలని సంకల్పించారు. దానికోసమే కాళేశ్వర ప్రాజెక్టుకు అంకురార్పణ చేశారు. సిరిసిల్ల జిల్లాలో కరువు నివారణకు, రైతుల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ఎమ్మెల్యే, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ భావించారు. దానికోసం మల్కపేట జలాశయం సామర్థ్యాన్ని 0.35 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచాలని నీటిపారుదలశాఖకు సూచించారు. జలాశయ సామర్థ్యం మూడు టీఎంసీలకు పెంచడం వల్ల ఆయకట్టు చాలావరకు పెరుగుతుందని తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావించి కేటీఆర్ ఈ సూచనలు చేశారు. కేటీఆర్ సూచనలకు అనుగుణంగా మల్కపేట జలాశయం రీఇంజినీరింగ్‌లో భాగంగా జలాశయ సామర్థ్యం 3 టీఎంసీలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. 2017 నుంచి అనేక సందర్భాల్లో ప్రాజెక్టు పనులను పరిశీలించి, అధికారులతో రివ్యూలు నిర్వహించారు. తక్కువ సమయంలో ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కేటీఆర్ చేసిన కృషి హర్షణీయం.

3 టీఎంసీల సామర్థ్యంతో ఏడు గుట్టల మధ్య 5 కిలోమీటర్ల పొడవుతో నిర్మించిన మల్కపేట రిజర్వాయర్‌లోకి 130 మీటర్ల లోతు నుంచి 1100 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేందుకు 30 మెగావాట్ల సామర్థ్యం ఉన్న రెండు మోటర్లతో పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. సర్జ్‌పూల్ పంపుహౌస్‌ల ద్వారా నీటిని మల్కపేట రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసి, అక్కడి నుంచి గ్రావిటీ కాలువల ద్వారా ఎల్లారెడ్డిపేట మండలం సింగసముద్రం చెరువు, గంభీరావుపేట మండలం బట్టల చెరువులను నింపే పనులు పూర్తయ్యాయి. బట్టల చెరువు నుంచి ఎగువ మానేరు ప్రాజెక్టులోకి కాలువ ద్వారా నీటిని తరలించే పనులు సైతం పూర్తి చేశారు. త్వరలోనే మల్కపేట రిజర్వాయర్ అందుబాటులోకి రానున్నది. తద్వారా పసిడి పంటలు పండనున్నాయి.

కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజ్-9లో భాగంగా నిర్మాణం పూర్తి చేసుకున్న మల్కపేట జలాశయం ద్వారా జిల్లాలోని సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట్, ముస్తాబాద్, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, కోనరావుపేట మండలాలలో దాదాపు లక్ష ఎకరాల మెట్ట భూమి మాగాణిగా మారనున్నది. భూగర్భ జలాలు పెరగడంతో పాటు, వ్యవసాయ రంగ అభివృద్ధి, అనుబంధ రంగాలైన మత్స్య, పాడి, పర్యాటకం అభివృద్ధి చెంది స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజ్-9 మల్కపేట ప్రాజెక్టుకు చెన్నమనేని రాజేశ్వరరావు పేరు పెట్టారు గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్. చిన్న, సన్నకారు రైతుల అభివృద్ధి కోసం సుదీర్ఘ పోరాటం చేసిన రాజేశ్వరరావు పేరు పెట్టడం చాలా గొప్ప విషయం. సిరిసిల్ల వేములవాడ ప్రాంతాలకు సాగునీరు అందించాలని ఎన్నో పోరాటాలు చేసిన ఘనత ఆయనది. ఈ ప్రాంతంలో సాగునీరు కోసం ఎత్తిపోతల పథకమే శరణ్యమని ఆనాడే పోరాటాలకు రూపకల్పన చేసిన దార్శనికుడు. త్వరలోనే మల్కపేట రిజర్వాయర్‌ను ప్రారంభించనున్నారు. సిరిసిల్ల, వేములవాడ మెట్ట ప్రాంతానికి ఈ రిజర్వాయర్ వరప్రదాయనిగా నిలువనున్నది. అసాధ్యం అనుకున్న 60 ఏండ్ల కలను నెరవేర్చిన అపర భగీరథుడు కేసీఆర్‌కు ఈ ప్రాంత ప్రజలు ఎల్లకాలం రుణపడి ఉంటారు.



## కాంగ్రెస్‌వి కంగాళీ పథకాలే

'ఓడ ఎక్కేదాక ఓడ మల్లన్న.. ఓడ దిగిన తర్వాత బోడ మల్లన్న' అన్న సామెత కాంగ్రెస్ పార్టీ చేస్తున్న వాగ్దానాలకు సరిగ్గా సరిపోతుంది. పదేండ్లుగా అధికారంలో లేని పార్టీ ప్రస్తుతం అధికార దాహంతో ఆవురావురని ఎదురుచూస్తున్నది. అమలుకానీ హామీలను చేసి చూపిస్తామని చెప్తున్నది.



కన్నోజు మనోహరాచారి
79950 89083

ఆ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతినెలా రూ.2500 ఇస్తామనేది ఒకటి. ఆధార్‌కార్డులతో పోల్చి చూసుకున్నపుడు 2022 నాటికి తెలంగాణ రాష్ట్రంలో 1.89 కోట్ల మంది మహిళలు ఉన్నారు. వీరందరికీ రూ.2500 చొప్పున ప్రతినెలా ఇవ్వాలంటే ఎన్ని లక్షల కోట్లు అవసరం అవుతాయి? అందరికీ ఇస్తారా? లేదంటే కొంతమందికే ఇస్తారా? ఆ కొంతమందిలో ఎవరెవరు ఉంటారో తెలియదు. ఇది సాధ్యమయ్యేదేనా?

ఇక తెలంగాణలో సుమారు ఆరున్నర లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరందరికీ రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామంటే మిగతా సొమ్ము ప్రభుత్వంపై పడుతుంది. నెలకు ఎన్ని వేల కోట్లు గ్యాస్ సిలిండర్ల మీద పెడతారు? అలాగే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అంటున్నారు. రోజుకు ఒక కోటి మంది ప్రయాణించే ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం మంది మహిళలు అనుకుంటే ఉచిత ప్రయాణం వల్ల ప్రతిరోజూ ఎన్నికోట్లు ఆర్టీసీ వెచ్చించాల్సి ఉంటుంది? ఒక ఏడాది కాలానికి ఆర్టీసీకి ఎన్ని వేల కోట్ల నష్టం వస్తుందో నాయకులు లెక్కలు వేసుకుంటే మంచిది. ఈ నష్టం వల్ల ఆర్టీసీ భవిష్యత్తులో కోలుకుంటుందా?

రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులకు ఏటా రూ.15 వేలు ఇస్తామంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 65 లక్షల మంది రైతులున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ఏటా రూ.10 వేల చొప్పున రైతుబంధు ఇస్తున్నది. దీనికి అదనంగా మరొక రూ.5వేలు కలిపి రైతు భరోసా కింద ఇస్తారు. అంటే ఎన్ని వేలకోట్లు అవసరం పడుతాయి? ఇక కౌలు రైతులు ఎంతమంది ఉన్నారో, ఎవరి పొలంలో ఎవరు పంట పండిస్తున్నారో ఆ రైతుకు మాత్రమే తెలుస్తుంది. కానీ, ప్రభుత్వం దగ్గర రికార్డులు ఉండవు. ఎవరు వ్యవసాయ కూలీలో కూడా ప్రభుత్వ రికార్డుల్లో ఉండవు. అలాంటపుడు ఎవరికి లబ్ధి చేకూరుతుంది? ఎన్ని కోట్ల రూపాయలు దుర్వినియోగం అవుతాయో ఆ పార్టీ వారికే తెలియాలి. ప్రస్తుత ప్రభుత్వం 44 లక్షల మందికి ఇస్తున్న చేయూతకు అదనంగా మరొక రెండు వేలు కలిపితే పింఛను రెండురెట్లు పెరుగుతుంది. ఇందుకు ఎన్ని కోట్లు అవసరం?

ప్రజలకు కేవలం డబ్బులు పంచి అధికారంలోకి రావాలనుకోవడం కాంగ్రెస్ పార్టీ విధానంగా కనిపిస్తున్నది. కాంగ్రెస్ పెద్దలు ఇలాంటి సాధ్యం గానీ హామీలు ఇచ్చేముందు వెనెజుల, శ్రీలంక, పాకిస్థాన్ దేశాల పరిస్థితిని గమనించాలి.

ఆ దేశాలు ప్రస్తుతం ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఒక రొట్టె ముక్క కోసం ఇబ్బంది పడుతున్న దేశాల పరిస్థితి తెలంగాణకు రావద్దు. నాటి కాంగ్రెస్ పాలకుల చేతకానితనం వల్లనే తెలంగాణ నాశనం అయింది. వేలాది మంది బతుకుతెరువు కోసం వలసలు వెళ్లారు. నేడు పచ్చబడ్డ తెలంగాణను చూసి మళ్ళీ వస్తున్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చూసి మురిసిపోతున్నారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తెలంగాణ మళ్ళీ వెనక్కుపోవద్దు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి లాంటి బృహత్తర ప్రాజెక్టులు కడతామని, ప్రతి ఊరికి బస్ కనెక్టివిటీ ఇస్తామని, ఒక పెద్ద పరిశ్రమను తీసుకొచ్చి వేలాది మందికి ఉపాధి కల్పిస్తామని కాంగ్రెస్ చెప్పటం లేదు. దేశం గర్వపడేలా మహిళలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతామని, విశ్వం గర్వపడేలా క్రీడల్లో రాణించే విధంగా అద్భుతంగా తీర్చిదిద్దుతామని చెప్పటం లేదు. మనిషి కష్టపడి సంపాదించిన దానికి అదనంగా ప్రభుత్వం సహాయం చేస్తుంది. వారి భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని చెప్పే పార్టీలకు ప్రజలు జేజేలు పలుకుతారు.

## బడిపిల్లలకు టిఫిన్లు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' పథకం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. పేద విద్యార్థులు ఖాళీ కడుపుతో చదువుకునే అవస్థ ఉండకూడదని, పౌష్టికాహారానికి లోటులేకుండా విద్యార్థుల కడుపు నింపాలన్న గొప్ప సంకల్పంతో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 27,147 ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 23లక్షల మంది పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్‌ను అందిస్తుండటం విశేషం.





సీవీవీ ప్రసాద్
80196 08475

తెలంగాణ ప్రభుత్వం సర్కారు బడుల్లోని విద్యార్థుల ఆకలితీర్చేందుకు 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథ కాన్ని ప్రారంభించింది. తొలిసారిగా హైస్కూల్ విద్యార్థులకూ బ్రేక్‌ఫాస్ట్‌ను అమలు చేయనున్నారు. బడి పిల్లలకు మెనూలో వేడి వేడి ఇడ్లీ సాంబార్.. పూరీ ఆలుకుర్మా.. ఉగ్గాని పల్లిచట్నీ.. రాగిఇడ్లీ పల్లీ చట్నీ.. రవ్వకేసరి తదితర టిఫిన్లు అందించనున్నారు. మిల్లెట్స్‌కూ ప్రాధాన్యం ఇచ్చి, రాష్ట్రంలో 23 లక్షల మంది విద్యార్థులకు లాభం చేకూర్చేలా విద్యాశాఖ ఈ పథకాన్ని రూపొందించింది. విద్యా ర్థులకు నాణ్యమైన విద్యనే కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మానవీయ కోణంతో పోషకాహారాన్ని అందిం చేందుకు ఈ వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. బడి ప్రారంభానికి ముందే ఉదయం 9.30 గంటలకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌ను వడ్డిస్తారు.

ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు దీన్ని అమలుచేస్తున్నారు. ప్రస్తుతం మధ్యాహ్నం పూట భోజనంలో సన్నబియ్యం, రాగిజావా, కోడిగుడ్లు, పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసుల సమయంలో స్నాక్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తూనే ఉన్నది. ప్రస్తుత పథకం ద్వారా మొత్తం తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని పనిదినాలలో బ్రేక్ ఫాస్ట్ ఇస్తారు. ఈ పథకానికి దాదాపు రూ.400 కోట్ల వ్యయం కాగలదని అంచనా. ఇప్పటికే గురుకుల విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, వారంలో 3 రోజులు కోడిగుడ్లు ఇస్తున్నారు.

**సర్కార్ బడిలో ఇచ్చే ఈ పోషకాహారం ప్రాముఖ్యం:**

1. పేద తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపకపోవడానికి అహార అభద్రతే కారణం. వారికి అన్నం పెట్టడానికి డబ్బులు లేక కూలీకి పంపేవారు. ఆ పరిస్థితి మారడానికి తెలంగాణ ప్రభుత్వం మధ్యాహ్నం భోజన పథకం, కేసీఆర్ బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టింది.
2. నిరుపేద కుటుంబాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా చదువు పట్ల ఏకాగ్రత పెరుగుతుంది.
3. సంపన్న బిడ్డలు తినే ఆహారాన్ని పేదింటి బిడ్డలు కూడా తినడం వల్ల పేద కుటుంబాల పిల్లలు బడి పట్ల ఆకర్షితులవుతారు.
4. పాఠశాలలో చేరే వారి సంఖ్యను, హాజరయ్యేవారి సంఖ్యను పెంచడం.
5. పిల్లల్లో సామాజిక సమభావన పెంపొందించడం, పౌష్ఠికాహార లోపాన్ని తగ్గించడం.

పిల్లలలో తగ్గిన అభ్యాస సామర్థ్యాలకు ప్రధాన కారణం పోషకాహార లోపం. చిన్నతనంలో ఆహార అభద్రత కారణంగా పఠనా సామర్థ్యం, స్వల్పకాలిక జ్ఞాపకశక్తి క్షీణిస్తుంది. దీనివల్ల చాలామంది పసి పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి పథకాల ద్వారా పిల్లలను తిరిగి పాఠశాలకు రప్పించడంతో పాటు పౌష్ఠికాహారం అందించడం ద్వారా వారిలో జ్ఞాపకశక్తిని పెంపొందించడం, తద్వారా ఉన్నతులుగా తీర్చి దిద్దడానికి ఆస్కారం ఉంటుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు, ఆరోగ్యవంతమైన జీవితానికి బడిని కేంద్రంగా చేసి బంగారు భవితకు బాటలు వేస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో మధ్యాహ్నం భోజనం, రాగిజావా వంటివి అందిస్తున్న ప్రభుత్వం తాజాగా సీఎం బ్రేక్‌ఫాస్ట్‌ను ప్రారంభించింది. దీనిద్వారా రెండు పూట లా ఆహారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే సమకూరుస్తున్నది.